క్లుప్తంగా

వివాదాస్పద ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు యత్నం

జడ్చర్ల: కావేరమ్మపేట, మాచారం గ్రామ శివార్లలో ఉన్న వెంకటాద్రినగర్, శేషాద్రినగర్‌లలో వివాద స్పద ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసేందుకు శనివారం సంబంధిత వ్యక్తులు ప్రయత్నం చేశారు. కాగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకుని బాధితులు వారిని నిలదీశారు. కొందరు స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లినట్లు సమాచారం. అయితే విషయం కాస్తా రచ్చకు దారితీస్తుందని భావించిన దళారులు అక్కడి నుంచి పరారయ్యారు. కాగా ప్రభుత్వ అనుమతి లేకపోవడంతో డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్‌కు నిరాకరించామని సబ్‌రిజిస్ట్రార్ ఆనంద్ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యేను పరామర్శించిన మంత్రి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్) : హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డిని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ శనివారం పరామర్శించారు. ఆయన భార్య సీతమ్మను వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరగాలి

నవాబుపేట: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను మరింత పెంచాలని ఎంపీపీ అనంతయ్య, జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు అన్నారు. నవాబుపేట ప్రాథమికారోగ్య కేంద్రంలో శనివారం మండల వైద్యాధికారులు విజయలక్ష్మి, డాక్టర్ నవీన్‌చందర్‌ల అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

ఉత్సవాలు ప్రారంభం

కోయిల్‌కొండ: మండల కేంద్రంలో శనివారం నుంచి బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాలను నిర్వాహకులు ఘనంగా ప్రారంభించారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బొడ్రాయి దేవత పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆదివారం హోమం, ఊరేగింపు, అభిషేకం, సోమవారం బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

పుస్తె, మెట్టెలు అందజేత

బాలానగర్ : మండల కేంద్రానికి చెందిన చాకలి వెంకటయ్య కుమార్తె వివాహానికి ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుడిసెల యాదయ్య తన వంతు సాయంగా పుస్తె, మెట్టెలను అందజేశారు. మాజీ సర్పంచ్ ఆచారి, రవికుమార్, మనోహర చారి తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

కోయిల్‌కొండ: మండలంలో కోత్లాబాద్, మణికొండ, కోయిల్‌కొండ ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరు మెరుగుపర్చేందుకు జన ఆరోగ్య సమితి కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమితి కన్వీనర్‌గా ఎంపీపీ శశికళ, కోకన్వీనర్‌లుగా జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్, సెక్రటరీగా డాక్టర్ నరేష్ తదితరులు ఎన్నికయ్యారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

మిడ్జిల్: మండలంలో రాత్రి వేళలల్లో అక్రమంగా ఇసుక రవాణా కొనసాగుతుందన్న సమాచారంతో శుక్రవారం రాత్రి జిల్లా మైనింగ్, విజిలెన్స్ అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. కొత్తపల్లి, అయ్యవారిపల్లి, వెలుగొమ్ముల శివారు లోని దుందుబి వాగు వద్ద పరిశీలించారు. వెలుగోమ్ముల క్వారీ వద్ద ఇటాచీ, టిప్పరు నిలిపి ఉండడంతో స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రామ్‌లాల్ నాయక్ హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

చిన్నచింతకుంట : పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఎఫ్‌టీయూ నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి అరుణ్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలో శనివారం సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. వచ్చెనెల 12 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించడంపై కార్యచరణ రూపొందించినట్లు వివరించారు. జిల్లా కార్యదర్శి జీఎస్ దేవదానం, శ్రీను, ప్రవీణ్ ఉన్నారు.

వేరుశనగ క్వింటా రూ.7,018

జడ్చర్ల/ దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో శనివారం వేరుశనగ క్వింటాల్‌కు గరిష్టంగా రూ.7,018, కనిష్టంగా రూ.4,559 ధరలు లభించాయి. అలాగే మొక్కజొన్నకు గరిష్టంగా రూ.1,916, కనిష్టంగా రూ.1,234, ఆముదాలు గరిష్టంగా రూ.5,503, కనిష్టంగా రూ.5,399, హంసకు గరిష్టంగా రూ.2,069, కనిష్టంగా రూ.1,569, ఆర్‌ఎన్‌ఆర్‌కు గరిష్టంగా రూ.2,269, కనిష్టంగా రూ.1,410, జొన్నలు సరాసరిగా రూ.4,200, పత్తి గరిష్టంగా రూ.6,613, కనిష్టంగా రూ.5,700 చొప్పున పలికాయి.

హంసకు రూ.1,803

దేవరకద్ర మార్కెట్ యార్డులో శనివారం జరిగిన ఈనామ్ టెండర్లలో హంస క్వింటాల్‌కు గరిష్టంగా రూ.1,803, కనిష్టంగా రూ.1,409 ధరలు నమోదయ్యాయి. సోనామసూరీకి గరిష్టంగా రూ.2,079, కనిష్టంగా రూ.1,769, ఆముదాలకు గరిష్టంగా రూ.5,329, కనిష్టంగా రూ.5,309 లభించాయి. మార్కెట్‌కు వెయ్యి బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

శిథిలావస్థలో పశువైద్య కేంద్రాలు

- మూసాపేటలో కూలడానికి సిద్ధంగా ఉన్న భవనం
- వేముల, పోల్కంపల్లిలో భవనాల పైకప్పు నుంచి లీకేజీలు
- ఆరు బయట విధులు నిర్వహిస్తున్న సిబ్బంది



మూసాపేటలో పెచ్చులూడిన భవనం పైకప్పు



వేములలో పరిస్థితి ఇలా..

అడ్డాకుల: మూసాపేట మండలంలో పశువైద్య కేంద్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. చాలా ఏళ్ల కిందట నిర్మించిన భవనాల పైకప్పులు పెచ్చులూడుతున్నాయి. వర్షాకాలంలో పైకప్పు నుంచి వర్షం నీళ్లు కిందకు కారుతుండటంతో పశువైద్య సిబ్బంది భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా పైకప్పుల నుంచి పెచ్చులు ఊడిపడుతుండటంతో సిబ్బందిలో ఆందోళన నెలకొంది. మూసాపేట మండలంలో మూసాపేట, వేముల, పోల్కంపల్లి, జానంపేట గ్రామాల్లో పశువైద్య కేంద్రాలు ఉన్నాయి. ఇందులో ఒక్క జానంపేట మినహా మూడు కేంద్రాలు శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. దీంతో పశువైద్య కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారు.

మూసాపేటలో ఆరుబయటే విధులు..

మూసాపేటలో పశువైద్య కేంద్రం పైకప్పు పూర్తిగా శిథిలమైంది. భవనం పైకప్పు నుంచి పెచ్చులు ఊడి పడుతున్నాయి. ప్రస్తుతం ఆస్పత్రిలో అటెండర్ సావిత్రి మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. భవనం శిథిలావస్థలో ఉండడంతో ఆస్పత్రి ఆవరణలోనే ఉంటూ విధులు నిర్వహిస్తున్నారు. క్యాంపులు, ఇతర కార్యక్రమాల సమయంలో వచ్చే పశువైద్యాధికారులు సైతం ఆస్పత్రి ఆవరణలోనే నిర్వహించి వెళ్తుండడం.. పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలుపుతోంది. కాగా కొత్తగా ఏర్పడిన మండల కేంద్రంలో పశువైద్య కేంద్రం శిథిలావస్థకు చేరినా పట్టించుకునే వారు కరువయ్యారని గ్రామస్తులు వాపోతున్నారు.

గోడలకు పగుళ్లు..

వేములలో ఉన్న పశువైద్య కేంద్రం కూడా శిథిలావస్థకు చేరింది. ఇక్కడ రెండు గదులు ఉండగా ఒక గదిలో గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. వర్షాకాలంలో పైకప్పు నుంచి వర్షం నీరు కిందకు కారుతోంది. ఇక్కడ మండల పశువైద్యాధికారి డాక్టర్ మధుసూదన్‌తో పాటు మరొకరు విధులు నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో పైకప్పు ఎప్పుడు కూలుతుందోనని ఆందోళన చెందుతున్నారు. పోల్కంపల్లిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పశువైద్య కేంద్రాలకు కొత్త భవనాలను మంజూరు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కొత్త భవనం నిర్మించాలి..



మా గ్రామంలో పశువైద్య కేంద్రం పైకప్పు నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి. భవనం ఎప్పుడు కూలి పడుతుందో తెలియకుండా మారింది. వైద్య సిబ్బంది కూడా బయటనే ఉండి విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాత భవనాన్ని కూల్చి వేసి కొత్త భవనం నిర్మించాలి. అప్పటి వరకు మరో చోట కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– బొక్కల, గోపాల్, మూసాపేట

పెచ్చులూడుతున్నాయి..



మండలంలో ఉన్న నాలుగు పశువైద్య కేంద్రాల్లో మూడు కేంద్రాలు శిథిలావస్థలో ఉన్నాయి. మూసాపేటలో భవనం పూర్తిగా శిథిలమైంది. పైకప్పు నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి. మా సిబ్బంది ఆరు బయటనే విధులు నిర్వహిస్తున్నారు. వేముల, పోల్కంపల్లిలోనూ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

– మధుసూదన్, పశువైద్యాధికారి, మూసాపేట

జూన్ 3న వాహనాల వేలం!



పట్టుబడిన వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ నర్సింహ

జడ్చర్ల: పోలీసుల తనిఖీలలో పట్టుబడిన వాహనాలను జూన్ 3న బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్పీ నర్సింహ తెలిపారు. జడ్చర్ల డీటీసీలో ఆయా వాహనాలను శనివారం పరిశీలించారు. సంబంధిత వ్యక్తులు సరైన పత్రాలు చూపి తీసుకెళ్లక పోవడంతో వాహనాలను డీటీసీలో భద్రపరిచామన్నారు. ఇప్పటి వరకు 86 వాహనాలు ఉన్నాయని వివరించారు. యజమానులు సరైన ధ్రువపత్రాలతో నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్‌కుమార్‌ను సంప్రదించాలని కోరారు. లేనిచో 3న బహిరంగ వేలం వేస్తామని అన్నారు.

ఘనంగా బొడ్రాయి వేడుకలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిడ్జిల్: రాణిపేట్‌లో బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ఠ అనంతరం జలాభిషేకం, బోనాలతో నైవేద్యం సమర్పించారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న పంచాయతీ కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ యాదయ్య, ఎంపీపీ సుదర్శన్, సర్పంచ్ నిరంజన్, నాయకులు బాలు, శ్రీనివాస్‌గౌడ్, పాండు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం..

మిడ్జిల్: మండల కేంద్రంలో సహకార సంఘం ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రారంభించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎకరానికి 40 క్వింటాళ్ల మొక్కజొన్న దిగుబడి సాధించిన యువ రైతు మోహన్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్, జెడ్పీటీసీ శశిరేఖ, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బాలు, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు

మిల్లర్లు అందినకాడికి దోచుకుంటున్నారు



రైతులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

గండీడ్: ధాన్యం కొనుగోలులో మిల్లర్లు దోపిడీకి పాల్పడుతున్నారని, బీజేపీ రాష్ట్ర కిసాన్‌మోర్చ మాజీ ఉపాధ్యక్షుడు మారుతికిరణ్ ఆరోపించారు. కామిరెడ్డిపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని శనివారం సందర్శించి మాట్లాడారు. ట్రాక్‌షీట్ రికార్డులను పరిశీలించారు. అవకతవకలు జరుగుతున్నా అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. ఒక బస్తాకు నాలుగు కిలోల తరుగు తీస్తూ రైతులను నిండా ముంచుతున్నారని అన్నారు. ఐకేపీ కేంద్రాల్లో వడ్లను కాంటా చేసిన తరువాత కూడా రైతులకు రశీదు ఇవ్వడం లేదని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాములు, మండల అధ్యక్షుడు ప్రభునాయక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికవ్యవస్థ చిన్నాభిన్నం



మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రధాన మంత్రి మోదీ తీసుకుంటున్న నిర్ణయాలతో దేశంలో ఆర్థికవ్యవస్థ చిన్నాభిన్నమైందని మాజీ టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2016లో చేసిన నోట్ల రద్దు వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. నల్లధనం వెనక్కితెస్తానని చెప్పిన మోదీ ఇప్పటివరకు ఏం చేశారో చెప్పాలన్నారు. ప్రస్తుతం రూ.2వేల నోట్లను వెనక్కి తీసుకున్న నిర్ణయం కూడా సరిగ్గా లేదన్నారు. కేవలం కార్పొరేట్ సంస్థలు, కాంట్రాక్టర్లు, పెద్ద వ్యక్తుల కోసమే ఇలాంటి చర్యలు తీసుకుంటున్నారని ఆరోపించారు. జిల్లా ప్రచార కార్యదర్శి సీజే బెనహర్, జిల్లా మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు బెక్కరి అనిత, పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ముకుందం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



భూత్పూర్‌లో విత్తనాల సంచులను పరిశీలిస్తున్న అధికారులు

భూత్పూర్ : పత్తి విత్తన కంపెనీల్లో శనివారం టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్‌లోని వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయానికి చెందిన అధికారుల బృందం ఏడీఏ సుధారాణి, విత్తనశుద్ధి ధృవీకరణ అధికారి ప్రసన్న, సీఐ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. గోదాముల్లో ఉన్న విత్తనాల శాంపిల్స్ తీసి పరీక్షలు నిర్వహించారు. ఎలాంటి కలుపు మందులు వాడలేదని తేలిందని తెలిపారు. మూడు రోజుల పాటు జిల్లాలో తనిఖీలు సాగుతాయని వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని అన్నారు. దేవరకద్ర ఏడీఏ యశ్వంత్‌రావు, మహబూబ్‌నగర్ రూరల్ ఏవో శ్యాం, స్థానిక ఏఈవో హర్ష, ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి తదితరులు ఉన్నారు.

చిన్నచింతకుంట : రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి రాజేష్‌ఖన్న, ఎస్‌ఐ మోహన్ బాబు హెచ్చరించారు. మండలంలోని చిన్నచింతకుంట, లాల్‌కోట, ఏదులాపూర్ గ్రామాల్లో విత్తన దుకాణాలను శనివారం తనిఖీ చేశారు. కొనుగోలు సమయంలో దుకాణాదారులు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని సూచించారు.

దేవరకద్ర: మండల కేంద్రంలో అధికారులు, పోలీసులు ఎరువులు, విత్తనాల దుకాణాలను శనివారం తనిఖీ చేశారు. మండల వ్యవసాయ అధికారి రాజేందర్ అగర్వాల్, ఎస్‌ఐ వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

అడ్డాకుల: మండల కేంద్రంలోని విత్తన దుకాణాల్లో శనివారం సాయంత్రం అధికారులు తనిఖీలు చేపట్టారు. మండల వ్యవసాయాధికారి పి.శ్రీనివాసులు, ఎస్‌ఐ మాధవరెడ్డి తదితరులు ఉన్నారు.

22న కలెక్టరేట్ ముట్టడి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: వీఓఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా శనివారం బతుకమ్మలతో ఊరేగింపు నిర్వహించారు. సమస్యలు పరిష్కరించకపోతే 22న కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని తెలిపారు. 29న చలో సెర్ప్ నిర్వహిస్తామని వివరించారు. అనంతరం రోడ్డుపైనే భోజనాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మొగులయ్య, వెంకటేశం, వెంకటయ్య, ధర్మానాయక్, శ్రీనివాసులు, శ్రీలత, జయమ్మ, భార్గవి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దశాబ్ది ఉత్సవాలు



నృత్యం చేస్తున్న విద్యార్థిని

జడ్చర్ల టౌన్: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేడుకలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా రెండవ రోజు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ఉత్సాహంగా నృత్య, వ్యాసరచన పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుచుకున్నారు. ప్రిన్సిపాల్ డా. అప్పియా చిన్నమ్మ, అధ్యాపకులు సుభాషిని, డా.నర్సింహరావు, యాదయ్య, విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల్లో నంబర్‌వన్

మహమ్మదాబాద్: ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో దేశంలో తమ ప్రభుత్వం నంబర్‌వన్‌గా ఉందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి తెలిపారు. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా శనివారం వెంకట్‌రెడ్డిపల్లి, ధర్మాపూర్, కొలిమికుచ్చతాండ, సంగాయపల్లిలో పర్యటించారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు శమంతకమణి, బాలాజీ, అంజిలయ్య, నర్సమ్మ, చాందిని, వైస్‌ఎంపీపీ ఈశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలు పంపిణీ



విత్తనాల పంపిణీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి

గండీడ్: పచ్చిరొట్ట ఎరువులతో అధిక దిగుబడులు వస్తాయని పరిగి ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం సబ్సిడీపై జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేటు తెరవాలని వినతి



మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దేవరకద్ర నాయకులు

దేవరకద్ర: రైల్వే గేటును ఎప్పటిలా తెరవాలని కోరుతూ శనివారం జిల్లా కేంద్రానికి వచ్చిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు వేర్వేరు వినతి పత్రాలను అందజేశారు. బీజేపీ జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి, దేవరకద్ర మండల అధ్యక్షుడు అంజన్‌కుమార్‌రెడ్డి, నాయకులు యజ్ఞభూపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, శ్రీశైల చారి, బాల్‌రాజు, రాజు తదితరులు ఉన్నారు. విషయంపై ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, రాష్ట్ర నాయకులు ఎగ్గని నర్సిములు కేంద్రమంత్రితో చర్చించారు. అదేవిధంగా మండల బీఆర్‌ఎస్ నాయకులు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి, నాయకులు శ్రీకాంత్‌యాదవ్, శివానంద్, యుగంధర్‌రెడ్డి, వెంకటేశ్, నరేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి విషయంపై వివరించారు.

అభివృద్ధిని ప్రజలకు వివరించాలి

పాలమూరు: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆధ్వర్యంలో నిర్వహించే మహాజన్ సంపర్క్ అభియాన్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని, లక్షల్లో బీజేపీ కార్యకర్తలు కేంద్రం ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి పనిచేస్తారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు అవగాహన సదస్సులో మాట్లాడారు. ఈనెల 30 నుంచి జూన్ 30 వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఏపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, పి.చంద్రశేఖర్, భరత్‌గౌడ్, బాలరాజు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



జిల్లా కేంద్రంలో క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు



నవాబుపేటలో..

మహబూబ్‌నగర్ రూరల్ : ప్రభుత్వం వీఆర్‌ఏలకు పేస్కేల్ వర్తింపజేస్తామనడం హర్షించదగ్గ విషయమని టీజీఓ జిల్లా అధ్యక్షుడు రాజ్‌గోపాల్ అన్నారు. తెలంగాణ చౌరస్తాలో శనివారం వీఆర్‌ఏలు సీఎం కేసీఆర్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. జిల్లా జాక్ చైర్మన్ రామచంద్రయ్య సమ్మె కాలంలో అమరులైన వీఆర్‌ఏల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర జేఏసీ కన్వీనర్ సాయన్న, కో-కన్వీనర్ గోవింద్, జిల్లా కో-చైర్మన్ కె.యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాధికరెడ్డి, జిల్లా కన్వీనర్ ఎండీ మునీర్, కోశాధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం కేసీఆర్, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చిత్రపటాలకు వీఆర్‌ఏలు క్షీరాభిషేకం చేశారు. సంఘం జిల్లా నాయకులు శేఖర్, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, ఎంపీపీ అనంతయ్య, ప్రతాప్, యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, అంజయ్య తదితరులు ఉన్నారు.

నీటి వసతి కల్పించడానికి చర్యలు

బాలానగర్ : ఉప సర్పంచ్ గిరిధర్ రావు, వైస్ ఎంపీపీ వెంకటచారి ఆలోచనతో తన పుట్టిన రోజు సందర్భంగా రూ. 70 వేలు ఖర్చు చేసి మండల కేంద్రంలోని కమాన్ వద్ద బోరు వేయించారు. ఈ మేరకు గిరిధర్ రావును ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అభినందించారు. నాయకులు కర్ణం శ్రీనివాస్‌రావు, సాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

అడ్డాకుల: రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయపడిన ఘటనిది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూత్పూర్ మండలం అమిస్తాపూర్ గ్రామానికి చెందిన రాజశేఖర్ శనివారం సాయంత్రం తన భార్యతో కలిసి కొత్తకోట వైపు వెళ్తుండగా మూసాపేట మండలం జానంపేట శివారులో అగ్రో సీడ్స్ కంపెనీ ఎదురుగా ఉన్న పెట్రోల్ పంపు వద్ద లారీ వెనుక బైక్ ఢీకొట్టుకుంది. దీంతో రాజశేఖర్‌కు బలమైన గాయాలయ్యాయి. ఆయన భార్య స్వల్ప గాయాలతో బయటపడింది. స్థానికులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. దీనిపై విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారీని ఠాణాకు తీసుకెళ్లారు.

సంతాపం

జడ్చర్ల టౌన్: పట్టణానికి చెందిన సీనియర్ డ్రైవర్ వడ్డెర రాజు (54) అనారోగ్యంతో మృతిచెందటంపై లైట్‌మోటర్ వెహికల్ డ్రైవర్స్ అసోసియేషన్ శనివారం సంతాపం ప్రకటించింది. అసోసియేషన్ అధ్యక్షుడు రవిశంకర్ ఆధ్వర్యంలో డ్రైవర్లు అడ్డా వద్ద మౌనం పాటించారు. రాజు మృతిపై స్థానిక ఎమ్మెల్యే డా. లక్ష్మారెడ్డి సంతాపం ప్రకటించారు. మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని అతడి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ సైతం రాజు మృతదేహం వద్ద నివాళులు అర్పించారు.

జడ్చర్ల వాసికి డాక్టరేట్

జడ్చర్ల టౌన్: సామాజిక సేవ చేసినందుకు గానూ పట్టణానికి చెందిన గోనెల రాధాకృష్ణకు అమెరికా(టెక్సాస్)కు చెందిన అంతర్జాతీయ డేస్ప్రింగ్ థియోలాజికల్ యూనివర్సిటీ అనుబంధ సంస్థ హైదరాబాద్ హెచ్‌ఎస్‌పీ యూనివర్సిటీ నుంచి శనివారం గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. సికింద్రాబాద్ సెయింట్ పాట్రికల్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాదర్ బిషప్ మండూరి వరప్రసాద్ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

పేదలకు ఇబ్బంది కలగనివ్వం : మంత్రి



మినీ ట్యాంక్‌బండ్ పనులను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి

జెడ్పీసెంటర్(మహబూబ్ నగర్) : ఎనుగొండ రోడ్డు నిర్మాణంలో భాగంగా బాధితులందరికీ ఇంటి స్థలాలు, ఇళ్లు కేటాయించి న్యాయం చేస్తున్నామని మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. శనివారం వారితో మంత్రి మాట్లాడారు. అభివృద్ధి వల్ల పేదలు నష్టపోకూడదన్నదే తమ ప్రధాన ధ్యేయమని, పనులు జరుగుతున్న క్రమంలో నష్టం జరిగితే అన్ని విధాల అండగా ఉంటున్నామని అన్నారు. బాధితుల వివరాలన్నీ తీసుకొని వెంటనే ఇళ్ల స్థలాలు, ఇళ్లు కేటాయించాలని అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు పట్టణంలో నిర్మించిన బైపాస్ రోడ్డు, అప్పనపల్లి రెండో రైల్వే బ్రిడ్జి నిర్మాణంలో బాధితులందరికీ పరిహారం అందించి ఆదుకున్నామన్నారు. జడ్చర్ల నుంచి మహబూబ్ నగర్ వరకు జరుగుతున్న ఫోర్ లైన్ రోడ్డు పనుల్లో భాగంగా ఎనుకొండ వద్ద కొంతమేర పెండింగులో ఉన్న రోడ్డు విస్తరణ చేపట్టేందుకు సహకరించాలని, అన్ని విధాలా న్యాయం చేస్తామన్నారు. అంతకుముందు రోడ్డు విస్తరణలో భాగంగా ఏనుగొండ మైసమ్మ దేవాలయం బోర్ మూతపడగా నూతనంగా ఏర్పాటుచేసిన బోరును మంత్రి ప్రారంభించారు. అనంతరం డ్రెయినేజీ పనులను పరిశీలించారు. మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, గౌరెల పెంపకం దారుల సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు శాంతయ్య యాదవ్, కౌన్సిలర్లు కిషోర్ కుమార్, అంజాద్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ట్యాంక్‌బండ్ పనుల పరిశీలన..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని పెద్ద చెరువు వద్ద మినీ ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్డు, ఐలాండ్ పనులను శనివారం మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి తనిఖీ చేశారు. ముందుగా మోడ్రన్ రైతు బజార్ పక్క నుంచి నిర్మిస్తున్న అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వర్షాలు ప్రారంభం కాకముందే ఈ పనులన్నీ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రహమాన్, నీటిపారుదలశాఖ డిప్యూటీ ఈఈ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: వేసవి ఉచిత కరాటే శిక్షణా శిబిరాన్ని విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని జీకే షోటోకాన్ కరాటే దూ ఇండియా మహబూబ్‌నగర్ పట్టణ ఉపాధ్యక్షుడు మాస్టర్ నవీన్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీనివాస్‌కాలనీ పార్క్‌లో ఈనెల 1 నుంచి శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారికి పరీక్షలు నిర్వహించి బెల్టులు అందజేస్తామని అన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు, యువత శిక్షణా శిబిరంలో పాల్గొనవచ్చని, మిగతా వివరాల కోసం 8106901565 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

కేసు నమోదు

జడ్చర్ల: ఆటోను ఢీకొట్టి ఓ ప్రయాణికుడి మరణానికి కారణమయిన స్కార్పియో వాహన డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేశ్‌బాబు శనివారం తెలిపారు. హౌసింగ్‌బోర్డు కాలనీ సమీపంలో మహబూబ్‌నగర్ నుంచి జడ్చర్ల వైపు వస్తున్న ఆటోను శుక్రవారం రాత్రి స్కార్పియో వాహనం అతి వేగంగా వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో ఆటో ముందు వెళ్తున్న ఓ కారును ఢీకొని ఓ గుంతలో పడిపోయింది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న చంద్రవర్ధన్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా మరోఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. దెబ్బతిన్న కారు డ్రైవర్ బొట్ట రాంబాబు ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.